# అమ్మా నన్ను నమ్మవూ?

నాలుగయిదు సార్లు ప్రయత్నించినా రికార్డు షీటు మీద బొమ్మ సరిగా రావటంలేదు. పెన్సిలు వంకర అవుతోంది. చేతిలో పెన్సిలు పెట్టుకుని శారద ఆలోచనల్లో పడి పోయింది. మనసు చికాకుగా ఉంది. నిన్న జరిగిన సంఘటన ఎంత మర్చిపోదామనుకున్నా మర్చిపోలేక పోతోంది. దాని గురించి ఏదో చేయాలి. ఏంచేయాలి, ఎలా చేయాలో అర్థం కావటంలేదు. రాజారావు అలా ప్రవర్తిస్తాడని తను ఊహించ లేదు. క్లాసులో అనవసరంగా ఏ విషయంలోను, ఎవరితోనూ జోక్యం కలిగించే మనస్తత్వం కలవాడు కాదు. ఎక్కువ సమయం లైబ్రరీలో గడుపుతుంటాడు. అల్లరి చేసే పిల్లలతో కలిసి తిరగటం తనెప్పుడూ చూడలేదు. అతనంటే తనకు గౌరవం ఉంది. రెండు మూడు సార్లేమో మాట్లాడింది. మర్యాదగా జవాబిచ్చాడు. ఎక్కువగా ఏం మాట్లాడలేదు.

"శారదా" విమల మేడం పిలిచింది.

శారద లేచి నిలబడి మేడం దగ్గరకు వచ్చింది.

"ఈ స్కార్పియాన్ బొమ్మ ఇలా వేశావేమిటి? భాగాలు కూడా గుర్తు పెట్టలేదు."

"సారీ మేడం. మర్చిపోయాను."

"రీడ్రా."

"సరే మేడం."

"నిన్నేం జరిగింది?"

శారద వెంటనే జవాబు చెప్పలేదు.

"బోటనీ క్లాసులో ఏదో జరిగిందట...అతని పేరేమిటి?"

"రాజారావు"

"సన్నగా, పొడుగ్గా ఉంటాడు. అతనేకదూ?" అవునన్నట్టు తలూపింది.

"అసలేం జరిగింది?"

"బోటనీ క్లాసు సత్యనారాయణగారు తీసుకున్నారు. అవర్ అయిపోయింది. సార్ వెళ్లిపోగానే అందరం బయటకెళ్దామని లేచాం. నా కొంగు ఎవరో పట్టి లాగినట్లనిపించింది.

వెనక్కి తిరిగి చూస్తే రాజారావు నుంచుని ఉన్నాడు. అతని చేతిలో కొంగు ఉంది. నేను సీరియస్‌గా చూసే సరికి వదిలేశాడు. చాలమంది చూశారు. వెంటనే ఈ విషయాన్ని సత్యనారాయణ గారికి చెప్తే కంప్లెయింట్ రాసిమ్మన్నారు. అప్పటికప్పుడు రాసి ఇచ్చేశాను"

శారద చెప్పటం ముగించాక అతనలాటివాడు కాదనుకుంటాను అందామనుకుంది. మాట నోటి చివరి వరకు వచ్చింది. అనలేదు. "వెళ్లి, బొమ్మ మళ్లీ వేసి చూపించు." అంది. శారద కదలబోతోంటే ఆఫీసు ప్యూను వచ్చి "అమ్మా, నిన్ను ప్రిన్సిపాల్‌గారు పిలుస్తున్నారు" అన్నాడు. సత్యనారాయణగారు తన కంప్లెయింట్‌ను ప్రిన్సిపాల్‌గారికి ఇచ్చి ఉంటారు అనుకుని ప్యూను వెనకనే ఆయన గదివైపు నడవసాగింది. ప్రిన్సిపాల్ వెంకట్రావంటే కాలేజీలో అందరూ భయపడుతుంటారు. మాటలు చాలా కరుకుగా ఉంటాయి. ఈ మూడు సంవత్సరాలలో తనెప్పుడూ ఆయనతో మాట్లాడలేదు. ఆయనటు వస్తున్నాడంటే విద్యార్థులు మరోదారి చూసుకునేవాళ్లు. తడబడే అడుగులతో గది దగ్గిరయింది. పక్కగది లోంచి టైప్ రైటరు చప్పుడు వినిపిస్తోంది. గది బయట రాజారావు నిలబడి ఉన్నాడు. అతని వంక చూడబుద్ధి కాలేదు. 'ఒకరికి గట్టిగా బుద్ధి చెబితే గాని మిగతా వాళ్లకు పాఠంగా ఉండదు' అనుకుంది.

గుండె వేగంగా కొట్టుకుంటుంటే గదిలోకి అడుగుపెట్టింది.

"నీ పేరు శారద కదూ?" అడిగాడు ప్రిన్సిపాల్.

అవునన్నట్టు తలూపింది.

"అసలేం జరిగిందో నీ ద్వారా విందామని పిలిపించాను. చెప్పు."

జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పింది.

"మునుపు ఎప్పుడయినా అలా ప్రవర్తించాడా, నీతో కాని, మరెవరితోనయినా కాని?"

"లేదండి."

"అతన్ని కాలేజీ నుండి తీసేద్దామనుకుంటున్నాను. నీ ఉద్దేశంలో అతను ఎటువంటివాడు? రోగ్ అనుకుంటున్నావా, వార్నింగిచ్చి వదిలేయమంటావా? కంప్లెయింట్ ఇచ్చింది నువ్వు కాబట్టి నిన్ను అడగటం భావ్యం అనిపించి అడుగుతున్నాను."

శారద నోరు విప్పలేదు.

"నువ్విక వెళ్లొచ్చు."

గది బయటకు వచ్చి జువాలజీ లేబరటరీ వైపు వెళ్లి పోయింది.

రాజారావు గదిలోకి రాగానే వెంకట్రావు కుర్చీలో చేరగిలబడి కూర్చున్నాడు.

"మీ నాన్న గారి పేరేమిటి?" అడిగాడు.

"నాగభూషణమండి."

"ఏం చేస్తుంటారు?"

"లేరండి. చనిపోయారు."

"ఆస్తి ఎంతుందేమిటి?"

"ఒక ఇల్లు తప్ప ఏమీ లేదండి."

"మరి ఎవరు చదివిస్తున్నారు?"

"మా అమ్మ."

"ఏం చేస్తుంటారు?"

"ఎలిమెంటరీ స్కూలు టీచరండి."

"ఏ ఊరు?"

"బాపట్ల."

"నీ స్కూలు ఎడ్యుకేషనంతా బాపట్లలోనే జరిగిందా?"

"అవునండి."

"శారద నీ మీద కంప్లెయింట్ ఇచ్చింది. నీ గురించి వాకబు చేశాను. ఎవరూ నీ గురించి చెడుగా చెప్పలేదు. ఏదయినా పొరపాటు జరిగి ఉంటే చెప్పు."

"ఆ అమ్మాయి కొంగు బెంచికున్న మేకుకు పట్టుకుంటే తీశాను. అంతే నండి..."

"అలా చేయకుండా ఉండవలసింది." అని వెంకట్రావు కళ్లద్దాలు తీసి బల్లమీద పెట్టి ముందుకు వంగి, "నాకూ నీ మీద జాలిగాఉంది... నిన్ను కాలేజీ రోల్సు నుండి తొలగిస్తున్నాను. ఇవిగో నీ టి.సి., సి.సిలు...." ముందుకు నెడ్తుంటే రాజారావు దుఃఖం ఆపుకోలేకపోయాడు. కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే "సార్ – ప్రమాణం చేసి చెబుతున్నాను. నేను మరో ఏ ఉద్దేశంతోనూ ఆమె కొంగు పట్టుకోలేదు." అన్నాడు.

"నువ్వికే వెళ్ళొచ్చు."

"సార్...దయచేసి...."

"నువ్వికే వెళ్ళొచ్చు అన్నాను...." వెంకట్రావు కంఠస్వరం కఠినంగా లేదు కాని మెత్తగా లేదు.

కాలేజీ మెయిన్‌గేటు దాటి బయటకు వచ్చాడు. తనకూ కాలేజీకి సంబంధం తీరిపోయింది. తనను కాలేజీ నుంచి తీసేసినట్టు ప్రతి క్లాసుకూ నోటీసు పంపించి చదివిస్తారు. ప్రతి నోటీసుబోర్డు మీదా అతికిస్తారు. ఈ మూడు సంవత్సరాల చదువు మట్టికొట్టుకుపోయింది. ఏమి చేయాలో అర్థంకావటంలేదు. మెదడు మొద్దుబారిపోయినట్టుంది. రోడ్డు దాటి సుభానీ సిగరెట్ బంకు దగ్గరకు వచ్చి నుంచోగానే "సోడాకొట్టేదా?" అడిగాడు సుభానీ.

"వద్దు. పేకెట్ సిగరెట్లివ్వు" అన్నాడు రాజారావు.

"ఏ బ్రాండు?"

అంతకు ముందు రాజారావు సిగరెట్లు ఎప్పుడూ తాగలేదు. నోటికొచ్చిన బ్రాండు పేరుచెప్పి అగ్గిపెట్టెకూడా కొనుక్కుని సిగరెట్ తీసి వెలిగించాడు. గట్టిగా దమ్ముపీల్చేసరికి దగ్గు వచ్చింది.

"క్లాసు లేదా?"

అక్కడ ఉండబుద్ధికాలేదు రాజారావుకు. "ఉంది" అని ముందుకు నడిచాడు. గదికి చేరుకుని గుడ్డలు మార్చుకోకుండా పరుపుమీద పడుకున్నాడు. రేపో, ఎల్లుండో ఇంటికి వెళ్తాడు. మూడు నెలల్లో ఫైనలు పరీక్షలు పెట్టుకుని హఠాత్తుగా ఇంటికి వచ్చినందుకు అమ్మ తప్పకుండా కారణం అడుగుతుంది. తనను కాలేజీ నుండి తీసేశారన్న బాధ కన్నా అమ్మకు ఏ విధంగా చెప్పాలనే బాధ క్రమక్రమంగా గూడుకట్టుకుంటూ భారం కాసాగింది. మూగన్నుగా నిద్రపడుతోంటే తలుపు తట్టిన చప్పుడయింది. లేచి కూర్చుని "రండి" అన్నాడు. ఎవరో కొత్త వ్యక్తి లోపలికి వచ్చి, "నా పేరు సారధి. శారద నా చెల్లెలు" అని రాజారావు కాలరు పట్టుకుని "ఎందుకలా చేశావురా?" అని గుప్పిట ముడిచి లాగి ముఖం మీద బలంగా కొట్టాడు. ముక్కులోంచి రక్తం కారసాగింది. ఈ హఠాత్ చర్యకు ఏం చేయాలో అర్థం కాలేదు. సారధితో పోట్లాడే శక్తి లేదు. అతనితో సరికాడు. రెండు చేతులు జోడించి "దయచేసి నన్ను కొట్టొద్దు, నా మాట వినండి. నేను కావాలని చేయలేదు..." మాట ముగించేలోపల వరసగా దెబ్బలు పడ్డాయి. రాజారావు చొక్కా రక్తంతో తడిచిపోసాగింది. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. "రేపీ సమయానికి మళ్లీ వచ్చినప్పుడు నువ్విక్కడ ఉన్నావో చచ్చావనుకో." మరో నాలుగు దెబ్బలు బలంగా వేసి అతన్ని వదిలిపెట్టి వెళ్లి పోయాడు సారధి.

* * * *

కూతురును బడికి పంపించి తనూ బడికి వెళ్ళే ప్రయత్నంలో రాజారావు తల్లి ప్రసూనాంబ ఉన్న సమయంలో ఇంటి ఎదురుగా రిక్షా ఆగింది. ఎవరో అని ఆమె అనుకునేంతలో పెట్టెబేడాతో రాజారావు రిక్షా దిగి ఇంట్లోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమయింది, ఏమిటీ దెబ్బలు?" అడిగింది.

"కాలేజీలో మెట్లు ఎక్కబోతూ కింద పడ్డాను."

"సెలవులా?"

"కాదమ్మా."

"నేను పంపించిన డబ్బు అందిందా?"

"అందిదమ్మా."

"పరీక్ష లెప్పుడు?"

"పాపేది?"

"ఇప్పుడే బడికి పంపించాను. పరీక్షలెప్పుడని అడిగితే జవాబు చెప్పవేమిరా?"

కొద్దిసేపు మౌనంగా ఉండి చివరకు, "నన్ను కాలేజీ నుండి తీసేశారమ్మా" నెమ్మదిగా అన్నాడు.

ప్రసూనాంబ నమ్మలేనట్లు కొడుకు ముఖంలోకి చూసింది. రాజారావు దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. ఏడుస్తూనే జరిగినదంతా చెప్పేసరికి ఆమె కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ఆమెకు రాజారావు భవిష్యత్ మీద ఎంతో నమ్మకంతో ఉంది. ఎన్నో ఆశలు పెట్టుకుంది. కొడుకును చదివించటానికి ఎన్నో కష్టాలు పడింది. ముందు జీవితం సుఖదాయకంగా ఉంటుందనే ఆశ ఒక్కసారి పేకమేడలా కూలిపోయేసరికి ఏడుపు ఆపుకోలేక పోతోంది. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, "ఎందుకు చేశావురా అటువంటి అప్రాచ్యపు పని?" అడిగింది.

రెండు క్షణాలు మౌనంగా ఉండి, "అమ్మా! నువ్వు నన్ను కని, తల్లీ తండ్రి నువ్వే అయి పెంచి పెద్దచేసి చదువుచెప్పించావు. నా గురించి నీకు బాగా తెలుసు. నేనెటు వంటివాడినో మిగతా వారికంటే కూడా నీకు మరింత బాగా తెలుసు. ఎవరు కాకపోయినా కనీసం నువ్వయినా నన్ను అర్థంచేసుకుంటావని అనుకున్నానమ్మా" అన్నాడు.

* * *

మరుసటిరోజు కాలేజీకి వచ్చిన చిత్ర, "నేను మూడు రోజులపాటు కాలేజీకి రాకపోయేసరికి ఇంతగొడవ చేసే వేమిటి?" శారదను అడిగింది. శారద వెంటనే జవాబు

చెప్పలేదు. "నాకూ ఒకసారి ఆ గదిలో అలానే అయింది. నా కొంగు మేకుకు పట్టుకుంటే వెనకనుండి ఏ అబ్బాయి లాగాడో అనుకున్నాను. నా కొంగు చిరిగిపోయింది కూడా. నీ విషయంలో రాజారావు సహాయం చేశాడు. అతను అటువంటి వాడుకాదని మనక్లాసులో అందరికీ తెలుసు. ఆ లెక్చరరు వెధవెవడో కంప్లెయింట్ రాసిమ్మంటే వెంటనే రాసియ్యటమేనా? కనీసం ఇంటికొచ్చి నన్ను అడిగినా బావుండేది. పైపెచ్చు మీ అన్నయ్యను నువ్వే పంపించి రాజారావును తన్నించావో లేదా మీ వాడే వెళ్ళి అతన్ని చితకబాదాడో నాకు అర్థం కావటం లేదు. ప్చ్. ఈ విషయంలో ఎవరూ సంతోషంగా లేరు. అదే ఏ పలుకుబడీ, డబ్బూ దస్కం ఉన్న తండ్రి కొడుకు మీద కంప్లెయింట్ రాసిచ్చి ఉండేదానివా, చెప్పు. కావాలని కొంగు పట్టి లాగినా మాట్లాడకుండా ఊరుకునేదానివి కాదా?" అడుగుతోంది.

సరిగ్గా ఆ సమయానికి – ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న రాజారావు శవానికి ఆస్పత్రిలో పోస్టుమార్టం జరుగుతోంది.

◆ ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 3 డిసెంబరు 1965